సాక్షి కర్నూలు

ఆదివారం, 9 ఏప్రిల్, 2023



శ్రీ మఠంలో డీఐజీ

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాత్రి మంత్రాలయం వచ్చారు.



మండు వేసవిలోనూ జలకళ

హొళగుంద: మండు వేసవిలోనూ తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) గలగలా ప్రవహిస్తూ కనువిందు చేస్తోంది. పంటలు కోత దశకు చేరుకోవడంలో నీటికి డిమాండ్ తగ్గింది.



మహానందిలో సందడి

మహానంది: మహానంది ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కోనేరుల్లో పుణ్య స్నానాలాచరించిన భక్తులు శ్రీకామేశ్వరిదేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు.

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:37	ఉ॥ 4:43
ఆదోని	సా॥ 6:40	ఉ॥ 4:46
నంద్యాల	సా॥ 6:37	ఉ॥ 4:46
ఆత్మకూరు	సా॥ 6:35	ఉ॥ 4:40
బనగానపల్లె	సా॥ 6:40	ఉ॥ 4:40

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :
మొరపెట్టుకునే వారు ఉన్నారా? వేడుకునే వారు ఉన్నారా? వారి మొర విని తీరుస్తాను అని అల్లాహ్ రంజాన్‌లో ప్రతిరోజూ మూడు సార్లు అడుగుతాడు. తరచూ అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండండి. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

'నవోదయ' విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సాగరిక

ఎమ్మిగనూరురూరల్: నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు కొత్తగా డిజిటల్ విద్యాబోధన అందిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ సాగరిక తెలిపారు. శనివారం బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పీటీసీ మెంబర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులకు టాబ్స్ ఇచ్చామన్నారు. వీటిలో జేఈఈ, నీట్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ కావటానికి మెటీరియల్ పొందుపరిచామన్నారు. సమావేశంలో నూతనంగా 20 మంది పీటీసీ మెంబర్స్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ చందిరన్, ఏకే బసవరాజ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా ఈ సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ ఏడాది భారీగా మట్టి పరీక్షలు

కర్నూలు(అగ్రికల్చర్): భూసార పరీక్షలు ఈ ఏడాది పెద్ద ఎత్తున నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ మార్గదర్శకాలు జారీ చేశారు. భూసార పరీక్షలపై అవగాహన పెంచేందుకు ఈ నెల 12న జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 16లోపు మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ జిల్లా, మండల స్థాయిలో వర్క్‌షాపులు ఏర్పాటు చేయనున్నారు. వర్క్‌షాపుల నేపథ్యంలో పెద్ద ఎత్తున మట్టి నమూనాలు సేకరిస్తారు. నమూనాలను కర్నూలు జిల్లాకు సంబంధించి ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రం, నంద్యాల జిల్లాకు సంబంధించి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని భూసార పరీక్ష కేంద్రంలో విశ్లేషిస్తారు.

'పది' పరీక్షలకు 286 మంది గైర్హాజరు

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షలకు 286 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శనివారం జరిగిన పరీక్షలకు 29,144 మంది విద్యార్థులకుగాను 28,858 మంది హాజరయ్యారు. జిల్లా పర్యటనలో ఉన్న పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పత్తికొండలోని ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాల, తుగ్గలిలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను తనిఖీ చేశారు.

జిల్లా సారథులు.. మహిళా మణులు

- మొదటి మహిళా జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ సృజన
- జేసీగా నారపురెడ్డి మౌర్య



డాక్టర్ సృజన



నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): జిల్లా పరిపాలనా బాధ్యతలు స్వీకరించే అవకాశం తొలిసారిగా మహిళలకు దక్కింది. జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ సృజన నియమితులై తొలి మహిళగా రికార్డు సృష్టించారు. జిల్లా స్థాయిలో రెండో అత్యుత్తమ అధికారి హోదా అయిన జాయింట్ కలెక్టర్‌గా నారపురెడ్డి మౌర్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈమె గతంలో ఉమ్మడి కర్నూలు జిల్లా హౌసింగ్ జేసీగా పనిచేశారు. జిల్లాల విభజన తరువాత నంద్యాల జిల్లా జేసీగా వెళ్లారు. తరువాత మెటర్నిటీ లీవ్‌లో ఉన్నారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఈమెకు కర్నూలు జేసీ బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టరు, జేసీలుగా ఇద్దరు మహిళలు రావడంతో పాలనలో పారదర్శకత పెరుగుతుందని ప్రజలు భావిస్తున్నారు. కలెక్టర్, జేసీలు సోమవారం లేదంటే బుధవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

నెల్లూరుకు వికాస్ మర్మత్ బదిలీ

రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో ఐఏఎస్ బదిలీలను చేపట్టింది. ఒకే సారి 57 మంది అధికారులను బదిలీ చేస్తూ ఏప్రిల్ 6వ తేదీ ఉత్తర్వులు ఇచ్చింది. అందులో భాగంగా కర్నూలు జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ సృజన, జేసీగా 2019 బ్యాచ్‌కు చెందిన వికాస్ మర్మత్ నియమితులయ్యారు. ఏప్రిల్ 7వ తేదీ సెలవు దినమైనా సాయంత్రం 6 గంటల సమయంలో జేసీగా పనిచేస్తున్న ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అయితే అనూహ్యంగా తెల్లవారే సరికి ఆయనకు మళ్లీ బదిలీ ఆదేశాలు అందాయి. నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఆయనను బదిలీ చేశారు. ఇక్కడికి నారపురెడ్డి మౌర్యను నియమించారు.

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌పై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా ఇటీవల విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను నిర్వహించింది. ఈ సమ్మిట్‌ను కర్నూలు జిల్లా కలెక్టర్‌గా నియమితులైన డాక్టర్ సృజన దగ్గరుండి నడిపించారు. ఈ క్రమంలో ఆమెను కర్నూలు జిల్లా కలెక్టర్‌గా పంపడం ద్వారా పరిశ్రమలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు అర్థంచేసుకోవాలి. ముఖ్యంగా కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ ఉండడంతో పారిశ్రామిక వేత్తలను రప్పించడానికి కలెక్టర్ హోదాలో డాక్టర్ సృజన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇక్కడ దాదాపు 10 వేల ఎకరాల భూములను ఇండస్ట్రియల్ హబ్ కోసం సేకరించారు. అలాగే 5 వేల ఎకరాల్లో గ్రీన్ కో విద్యుత్‌ప్రాజెక్టు ఉంది. వీటిని ముందుకు తీసుకెళ్లడానికి డాక్టర్ సృజన చర్యలు తీసుకుంటారని ప్రభుత్వం భావిస్తోంది.

క్వింటా మిర్చి రూ.21,505

- కర్నూలు మార్కెట్‌లో పడిపోతున్న ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి ధర క్రమంగా పడిపోతుంది. ఈ ఏడాది కర్నూలు మార్కెట్‌లో గుంటూరు యార్డుతో సమానంగా మిర్చికి గరిష్ట ధర లభించింది. దీంతో రైతుల తాకిడి కూడా ఎక్కువైంది. అయితే ఉన్నట్టుండి ధర పడిపోవడం రైతులను నిరాశకు గురిచేస్తోంది. ఒకదశలో క్వింటా మిర్చి ధర రూ.50వేలు దాటి పోయింది. ప్రస్తుతం 50 శాతం కూడా పలకకపోవడానికి వ్యాపారులు సిండికేట్ కావడమే కారణం అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మార్కెట్‌కు 388 మంది 1,665 సంచుల మిర్చి తీసుకురాగా.. కనిష్ఠంగా రూ.5,699, గరిష్ఠంగా రూ.21,505 ధర మాత్రమే లభించింది. మోడల్ ధర రూ.17,109 నమోదైంది. మిర్చి రైతులు నష్టపోకుండా మార్కెట్ కమిటీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

జిల్లా ఎస్పీగా కృష్ణకాంత్

- సిద్ధార్థ్ కౌశల్ ఆక్టోపస్‌కు బదిలీ



పేరు	: జి.కృష్ణకాంత్
పుట్టిన తేదీ	: జనవరి 22, 1987
భార్య	: ప్రవీణ (వైద్య విద్య, ప్రస్తుతం గృహిణి)
తల్లిదండ్రులు	: రామాంజనేయులు, రామతులసి
సొంత ఊరు	: దొండపాడు గ్రామం, గుత్తి మండలం, అనంతపురం జిల్లా
కుటుంబ నేపథ్యం	: వ్యవసాయం
విద్యాభ్యాసం	: టెన్త్ (జడ్పీహెచ్ఎస్, గుత్తి), ఇంటర్ (శంకరానందగిరి స్వామి కళాశాల, గుంతకల్లు), బీఎస్సీ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ (ఎన్‌డీఆర్ కల్నల్, హర్యానా)
సర్వీస్‌లో చేరిన తేదీ	: డిసెంబర్ 18, 2017

కర్నూలు: జిల్లా నూతన ఎస్పీగా జి.కృష్ణకాంత్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం అర్ధరాత్రి ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా 39 మంది ఐపీఎస్‌లకు స్థానచలనం కలిగింది. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న కృష్ణకాంత్ కర్నూలుకు బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లాకు ఈయన 55వ ఎస్పీ కాగా.. విభజన జరిగి ఏడాది గడచిన నేపథ్యంలో కర్నూలు జిల్లాకు మూడో ఎస్పీ. అనంతపురం జిల్లా గుత్తి మండలం దొండపాడు గ్రామానికి చెందిన ఈయన 2017లో ఐపీఎస్ హోదాలో పోలీసు శాఖలో చేరారు. గ్రేహౌండ్స్‌లో అసిస్టెంట్ కమాండర్‌గా, తూర్పుగోదావరి జిల్లా చింతూరులో అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహించారు.

తొమ్మిది నెలల పాటు సిద్ధార్థ్ కౌశల్ సేవలు

జిల్లా ఎస్పీగా సిద్ధార్థ్ కౌశల్‌ను 2022 జూన్ 23న ప్రభుత్వం నియమించింది. దాదాపు 9 నెలల పాటు ఈయన జిల్లాలో సేవలు అందించారు. తాజాగా ఆక్టోపస్ విభాగానికి బదిలీ అయ్యారు. జిల్లాలో అనతి కాలం పనిచేసినప్పటికీ తనదైన ముద్ర కనపర్చారు. ట్రాఫిక్ మిత్ర, మొబైల్ రికవరీ మేళా వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. తక్కువ కాలంలోనే విడతల వారీగా లోక్ అదాలత్ కార్యక్రమాలు నిర్వహించి పెండింగ్ కేసులను భారీగా తగ్గించడమే కాక సేఫ్ సిటీ పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 48 వాహనాలను సమకూర్చి డీఎస్పీ స్థాయి అధికారికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించి రాత్రి గస్తీ ముమ్మరం చేశారు. అలాగే ఇ-చలానాలు వసూలు చేయడంలో రాష్ట్రంలోనే కర్నూలును మొదటి స్థానంలో నిలిపారు. బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే ఫ్యాక్షన్ గ్రామాలైన కౌతాళం మండలంలోని కామవరం, దేవనకొండ మండలం కప్పట్రాళ్లలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని ప్రారంభించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ బాధ్యతలకు పెద్దపీట వేశారు.

నెల్లూరు ఎస్పీగా తిరుమలేశ్వరరెడ్డి

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు ప్రాంతీయ అధికారి తిరుమలేశ్వరరెడ్డి నెల్లూరు జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. 2009లో గ్రూప్-1 ద్వారా డీఎస్పీ హోదాలో పోలీసు శాఖలో చేరిన ఈయన రాయలసీమ జిల్లాల్లోని వివిధ సబ్ డివిజన్లలో పనిచేశారు. 2019 నుంచి దాదాపు నాలుగు సంవత్సరాలుగా అడిషనల్ ఎస్పీ హోదాలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు ప్రాంతీయ అధికారిగా పనిచేస్తున్నారు. గత ఏడాది నవంబర్‌లో నాన్ క్యాడర్ ఎస్పీగా పదోన్నతి పొందగా ఇటీవలనే ఈయనకు ఐపీఎస్ హోదా లభించింది. దీంతో నెల్లూరు ఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

కర్నూలులో రన్ ఫర్ జీసస్



రన్ ఫర్ జీసస్‌ను జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(టౌన్): ఈస్టర్ పండుగను పురస్కరించుకుని శనివారం కర్నూలు నగరంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి వద్ద ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం కర్నూలులో రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈఎస్‌టీ, కర్నూలు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, టీడీపీ నేత టీజీ భరత్, ఆర్సీఎం చర్చి పాస్టర్ అంతోని రాజు, ఈఎస్‌టీ ఫౌండర్ దాసరి సుధీర్, సిటీ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ ఆర్ డి సజీవరాజు పాల్గొన్నారు.

మళ్లీ జగనే రావాలి

- 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి విశేష స్పందన
- రెండో రోజూ ఉత్సాహంగా సాగిన కార్యక్రమం
- పట్టణాలు, పల్లెల్లో ప్రజాప్రతినిధులకు సాదర స్వాగతం

కర్నూలు(రాజ్‌విహార్): పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షించారు. రాష్ట్రంలో మంచి పాలన ఉందని, ఇది ఇలాగే కొనసాగాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం రెండో రోజూ శనివారం ఉత్సాహంగా సాగింది. గ్రామ, వార్డు కన్వీనర్లు, గృహసారథులతో కలసి ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లారు. ప్రజలను కలుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వారి కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. టీడీపీ హయాంలో చేసిన మోసాలను వివరించారు. ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు స్వీకరించారు. లబ్ధిదారుల అనుమతితో 'జగనన్నే మా నమ్మకం' అనే స్టిక్కర్లను ఇళ్లకు అతికించి వారి నుంచి పార్టీ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు.

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కల్లూరు అర్బన్‌లోని 33వ వార్డులో కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహులు, పార్టీ నాయకులు హనుమంతురెడ్డి, రంగప్ప పాల్గొన్నారు.
- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి గోనెగండ్ల పట్టణంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వార్డు కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ కర్నూలు మండలంలోని పంచలింగాల గ్రామంలో తిరిగారు. ప్రభుత్వం పట్ల ప్రజల నుంచి సానుకూల స్పందన రావడంతో వారి ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు.



అవ్వల ఆశీస్సు: ఎమ్మిగనూరు పట్టణం 11వ వార్డులో గోడకు అతికించిన సీఎం వైఎస్ జగన్ స్టిక్కర్‌ను చూస్తున్న వృద్ధులు



అతివల ఆదరణ: హొళగుంద మండలం చింతకుంట గ్రామంలో స్వచ్ఛందంగా స్టిక్కరు తీసుకుని ఇంటికి అతికిస్తున్న మహిళ గర్జమ్మ



కల్లూరు33వ వార్డులో మహిళలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ఇంత బాధ్యతారాహిత్యమా?

- విద్యాధికారులు, ఉపాధ్యాయులపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆగ్రహం



ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

పత్తికొండ రూరల్: విద్య కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతుంటే ఉపాధ్యాయులు, విద్యాధికారులు బాధ్యతారహితంగా వ్యవహరించడం తగదని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ హెచ్చరించారు. శనివారం హోసూరు జెడ్పీ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. 9వ తరగతి గదికి వెళ్లి ఇంగ్లిష్ పాఠ్యపుస్తకంలోని బోధనాంశాలను పరిశీలించారు. చెప్పిన అంశాలపై నోట్సు రాయించని ఉపాధ్యాయుడుపై మండిపడ్డారు. ఎన్సీఈఆర్‌టీ (?) కల నియమావళి ప్రకారంగా ప్రతి అంశాన్ని తూచ తప్పకుండా పాటించే ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధనలో ప్రాథమిక సూత్రాలు ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. భారతదేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో విద్య కోసం ప్రభుత్వం రూ.32వేల కోట్లు ఖర్చుపెడుతోందన్నారు. కింద నుంచి పైవరకు బాధ్యతాయుతంగా పనిచేస్తేనే అందుకు సార్థకత లభిస్తుందన్నారు. పర్యవేక్షణలోపంతోనే ఉపాధ్యాయులు బోధనలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని డిప్యూటీ డీఈఓ సుకుమార్, డీఈఓ రంగారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలరోజుల గడువులోగా పనితీరు మార్చుకోవాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాడు- నేడు పనులపై అసంతృప్తి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబడి నాడు-నేడు అమలు హోసూరు హైస్కూల్‌లో అధ్వానంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదిలో గోడలకు సిమెంటు తేలి ఉండి, రంగుపోయిన పైకప్పును పరిశీలించారు. ఇందుకు సంబంధించిన పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పది పరీక్ష కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కేంద్రంలో పరీక్ష నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌జెడీ ప్రతాప్‌రెడ్డి, ఏపీసీ వేణుగోపాల్, ఏడీ శ్యామ్యుల్‌పాల్, డీవీఈఓ జాకీర్‌హుసేన్, ఈఈ కారప్ప, పత్తికొండ, మద్దికెర, తుగ్గలి విద్యాధికారులు మస్తాన్‌వలి, రంగస్వామి, రమావెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు హజ్ యాత్రికులకు శిక్షణ

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి మక్కా మదిన వెళ్లే హజ్ యాత్రికులకు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు మౌలానా మజీద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అబ్బాసనగర్‌లోని యూనిక్ ఇంగ్లిష్ స్కూల్‌లో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది హజ్‌కు వెళ్లేవారు హాజరుకావాలని, యాత్రికులకు ఇఫ్తార్ విందు కూడా ఉంటుందన్నారు. వివరాలకు 9032875378 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో ఎస్‌ఐ మౌలి బాషా మృతి


మౌలి బాషా(ఫైల్)

బొమ్మలసత్రం: నంద్యాల త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న దూదేకుల మౌలి బాషా(60) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన ఈయన 1987లో బేతంచెర్లలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరాడు. అప్పటి నుంచి హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్‌ఐ నుంచి ఎస్‌ఐగా పదోన్నతి పొందారు. 2021 నుంచి నంద్యాల త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మౌలిబాషా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటంతో కుటుంబీకులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. విషయం తెలుసుకొని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి శనివారం మౌలిబాషా ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చాడు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల బెనిఫిట్స్ సకాలంలో అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

వివాహిత బలవన్మరణం


లక్ష్మి (ఫైల్)

గుంతకల్లు రూరల్: కుటుంబసభ్యుల వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గుంతకల్లు మండలం దంచర్ల గ్రామానికి చెందిన సుంకన్న, సుంకమ్మ దంపతుల కుమారుడు రంగస్వామికి ఏడేళ్ల క్రితం కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పులికొండ గ్రామానికి చెందిన లక్ష్మి(27)తో వివాహమైంది. ప్రస్తుతం వీరికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల భర్త, అత్తమామల వేధింపులు అధికమవడంతో లక్ష్మి పూర్తిగా విసిగిపోయింది. శుక్రవారం పురుగు మందు తాగడంతో కుటుంబీకులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అయితే కోలుకోలేక శనివారం తెల్లవారుజామున మరణించింది. కేసు నమోదు చేసినట్లు గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

అనాథలకు వాత్సల్య వరం

- అభాగ్య చిన్నారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేయూత
- మిషన్ వాత్సల్య కింద నెలకు రూ.4 వేల ఆర్థిక సాయం
- సర్వే చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు
- దరఖాస్తుకు ఈనెల 15 వరకు గడువు
- ఇప్పటికే 279 మంది ఖాతాల్లోకి రూ.72 లక్షల జమ


అంగన్‌వాడీ కేంద్రాల్లో మిషన్ వాత్సల్య పథక దరఖాస్తులను స్వీకరిస్తున్న కార్యకర్తలు

కర్నూలు(రాజ్‌విహార్): అభాగ్యులు, ఆదరణ లేని చిన్నారులకు చేయూత ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఎలాంటి ఆసరా లేని పిల్లలను గుర్తించి, వారి విద్య, వైద్య అవసరాలను తీర్చేందుకు ఆర్థిక చేయూత అందిస్తున్నాయి. ఇందుకోసం 'మిషన్ వాత్సల్య' పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 60:40 నిష్పత్తిలో నిధులు విడుదల చేస్తున్నాయి. ఈ పథకం కింద ఒక్కో చిన్నారికి కేంద్ర ప్రభుత్వం రూ.2,400, రాష్ట్ర ప్రభుత్వం రూ.1,600 ఇస్తున్నాయి. ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని తీసుకొచ్చారు.

దరఖాస్తుకు వీరు అర్హులు

తల్లిదండ్రులను కోల్పోయిన, తల్లిదండ్రులు దూరమైన చిన్నారులు, పాక్షిక అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయినవారు) అర్హులు. విడాకులు పొందిన తల్లిదండ్రులు ఉన్నవారు, కుటుంబం వదిలేసిన చిన్నారులు, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడి ఇబ్బంది పడుతున్న బాలలు, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన చిన్నారులు దరఖాస్తు చేసుకోవచ్చు. బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం–2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాల కార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల యాచకులు, బాల్య వివాహ బాధితులు, హెచ్‌ఐవీ బాధిత బాలలు, దివ్యాంగులు మిషన్ వాత్సల్య పథకం ద్వారా దరఖాస్తుకు అర్హులు. అర్హులైన వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు.



వార్షికాదాయ పరిమితి

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సంవత్సర ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు మించరాదు. జేజే బోర్డు, బాలల సంక్షేమ కమిటీ కోర్టు లిఖితపూర్వకంగా నమోదు చేసిన కారణాల ఆధారంగా అవసరాన్ని బట్టి స్పాన్సర్‌షిప్ పొడిగించవచ్చు. స్పాన్సర్‌షిప్ అందుకుంటున్న బాలలను ఏదైనా వసతిగృహం, బాల సదనంలో చేర్పించిన తర్వాత సహాయం నిలిపివేస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలల విషయంలో మినహా పాఠశాలలకు వెళ్లేవారు హాజరు 30 రోజులకు పైగా సక్రమంగా లేదని తేలితే పరిశీలించి, ఆర్థిక సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తారు.

దరఖాస్తుకు జత చేయవలసిన పత్రాలు

- బాలుడి/బాలిక జనన ధ్రువీకరణ పత్రం
- ఆధార్ కార్డు
- తల్లి ఆధార్ కార్డు
- తండ్రి ఆధార్ కార్డు
- తల్లి, తండ్రి డెత్ సర్టిఫికెట్, మరణ కారణం
- గార్డియన్ (సంరక్షకుల) ఆధార్, రేషన్ కార్డు
- కుల ధ్రువీకరణ పత్రం
- బాలుడు, బాలిక పాస్‌పోర్టు సైజ్ ఫొటో
- స్టడీ సర్టిఫికెట్
- ఆదాయ ధృవీకరణ పత్రం
- బ్యాంక్ అకౌంట్ వివరాలు.. బాలుడు/ బాలిక వ్యక్తిగత అకౌంట్/ తల్లి, తండ్రి, సంరక్షకులతో కలసిన జాయింట్ అకౌంట్.

ఈనెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు

జిల్లా వ్యాప్తంగా 279 మంది పిల్లలకు నెలకు రూ.4 వేలు చొప్పున గత ఏడాది నుంచి ఇప్పటి వరకు రూ.78.12లక్షలు బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ఈ పథకంలో చేరేందుకు పిల్లల వివరాలను సేకరించేందుకు అన్ని మండలాల్లోని మహిళ, శిశు సంక్షేమ అధికారి (సీడీపీఓ)లకు బాధ్యత అప్పగించారు. అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా ఈ సేకరణ జరుగుతోంది. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా మహిళ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి, ఎస్‌ఐసీపీఓ అధికారి, శిశు గృహ సంక్షేమ అధికారి, ఒక ఎన్‌టీఓ అధికారి సభ్యుల పర్యవేక్షణలో అర్హుల ఎంపిక విధానం జరుగుతుంది. అర్హులైన వారు ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

దరఖాస్తు పరిశీలన ఎలా...

సీడీపీఓ కార్యాలయానికి అందిన దరఖాస్తులన్నిటినీ మండల స్థాయి స్క్రూటినీ కమిటీ(తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, సీడీపీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్) సమావేశమై నిశితంగా పరిశీలిస్తుంది. ఎంపిక చేసిన ప్రతి దరఖాస్తుపై కమిటీ సభ్యులందరూ సంతకం చేసిన తర్వాత వాటిని జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయానికి పంపుతారు. ఈనెల 15 వరకు దరఖాస్తుకు అవకాశం ఉంది.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఇప్పటికే సీడీపీఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేశాం. అర్హులైనవారు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

– ఉమామహేశ్వరి, జిల్లా ఇన్‌చార్జి, మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి, కర్నూలు.

అంగన్‌వాడీల్లో సంప్రదించాలి



మిషన్ వాత్సల్య పథకం కోసం అర్హులైన వారు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. వచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపుతాం.

– శారద, డీసీపీఓ, కర్నూలు

నీటి ఎద్దడి నివారణకు రూ.2.65 కోట్లు


యర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీ చైర్మన్

కర్నూలు(అర్బన్): ప్రస్తుత వేసవిలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామాల్లో దాహార్తిని తీర్చేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే పలువురు జెడ్పీటీసీలు తమ పరిధిలోని గ్రామాల్లో తీవ్ర మంచి నీటి ఎద్దడి నెలకొందని, నీటి సరఫరా పైపుల మరమ్మతులు చేపట్టాలని తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. వీరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని తాగునీటి సమస్య పరిష్కారానికి జిల్లా పరిషత్ నుంచి ఒక్కో జెడ్పీటీసీకి రూ.5 లక్షల ప్రకారం రూ.2.65 కోట్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇదే విషయాన్ని గత మార్చి 29న జెడ్పీ సర్వసభ్య సమావేశంలోనూ స్పష్టం చేశామన్నారు. కొందరు జెడ్పీటీసీలు తమ పరిధిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా పరిషత్‌కు అందజేశారని.. వాటిని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈకి పంపుతున్నట్లు చెప్పారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గుర్తించిన 245 జనావాసాల్లో ప్రస్తుత వేసవిలో దాహార్తిని తీర్చేందుకు రూ.10.97 కోట్లు అవసరమవుతాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు వేసవి కార్యాచరణను రూపొందించి ప్రభుత్వానికి పంపించారన్నారు. కర్నూలు జిల్లాలో 107 జనవాసాల్లో రూ.8.08 కోట్లు, నంద్యాల జిల్లాలో 138 జనవాసాల్లో రూ.2.89 కోట్లతో ప్రణాళికలు రూపొందించారన్నారు. ఈ నిధులతో తాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, బోర్లు, వ్యవసాయ బావులను హైరింగ్ తీసుకోవడం, బోర్లలో డీపెనింగ్, ఫ్లషింగ్ తదితర పనులకు వెచ్చిస్తామన్నారు.

అప్పుల బాధ తాళలేక..


మృతి చెందిన దండగల శివుడు (ఫైల్)

బేతంచెర్ల: సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ వివరాల మేరకు.. సిమెంట్ నగర్ గ్రామంలోని లాంద్రి కొట్టాలకు చెందిన వడ్డె దండగల శివుడు(34) భార్య పార్వతి కొంత కాలం క్రితం ఆత్మహత్య చేసుకుంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కూలీకి వెళ్లి కుటుంబాన్ని పోషించే శివుడు రెండు సార్లు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో వైద్యం, కుటుంబ పోషణకు రూ. 3 లక్షల వరకు అప్పు చేశాడు. భార్య చనిపోవడం, అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపం చెందాడు. దీంతో శుక్రవారం రాత్రి ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి బీసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లెకు తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ముంజ చల్లన.. వ్యాపారం తియ్యన



ఆటోల్లో, మోటార్ సైకిళ్లపై, తోపుడు బండ్ల మీద, నీడ నిచ్చే చెట్ల వద్ద తాటిముంజల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఐస్ యాపిల్‌గా ఇవి పేరుగాంచాయి. శరీరానికి చలువ చేయడంతోపాటు అజీర్తిని తగ్గిస్తాయి. గుండె జబ్బులను దూరం చేస్తాయి. పారదర్శకంగా జెల్లీలా జారిపోయే వీటిని తినేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. వెల్దుర్తి మండలం రత్నపల్లెకు చెందిన రైతు నీలప్ప తన పొలం గట్టుమీద పెరిగిన తాటి చెట్ల నుంచి కాయలను తీసుకొచ్చి శనివారం బ్రహ్మగుండం దేవస్థానం వద్ద రహదారి పక్కన చెట్టునీడలో అమ్ముతూ కనిపించారు.

– వెల్దుర్తి

ఐదో విడత 1,427 సెల్‌ఫోన్ల రికవరీ


రికవరీ చేసిన సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కర్నూలు: చోరీకి గురైన, ఎక్కడైనా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు వెతికిమరీ తెచ్చిస్తున్నారు. ఆరు నెలల వ్యవధిలో నాలుగు విడతలుగా రూ.12.05 కోట్లు విలువ చేసే 5,727 మొబైల్ ఫోన్లను ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి రికవరీ చేసి బాధితులకు అందజేశారు. దీంతో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా సెల్‌ఫోన్ రికవరీలో అగ్రగామిగా నిలిచింది. ఐదో విడత రూ.4.05 కోట్ల విలువ చేసే 1,427 సెల్‌ఫోన్లు రికవరీ చేసి శనివారం బాధితులకు ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ చేతుల మీదుగా జిల్లా పోలీసు కార్యాలయం మైదానంలో అందజేశారు. సౌదీ అరేబియా నుంచి మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులైన నంద్యాల జిల్లాకు చెందిన బి.చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బిరామిరెడ్డికి అందజేయడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఒడిశా, ఉత్తరప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, బీహార్, రాజస్థాన్, తెలంగాణతో పాటు ఏపీలోని పలు జిల్లాల నుంచి కూడా సెల్‌ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అందించారు.

మొబైల్ పోగొట్టుకుంటే...

ఎవరైనా మొబైల్ పోగొట్టుకుంటే లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ లింక్‌లో www.kurnoolpolice.in మొబైల్ థెఫ్ట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి లింక్ ఓపెన్ చేసి ఫిర్యాదు ఫారం నింపాలి. పేరు, జిల్లా, పోలీస్‌స్టేషన్ పరిధి, మొబైల్‌కు సంబంధించిన ఐఎంఈఐ–1, ఐఎంఈఐ–2 నెంబర్లతో పాటు బిల్లులు ఆన్‌లైన్‌లో సమాచారం పొందుపరిస్తే సాంకేతిక ఆధారంగా ట్రాకింగ్ చేసి ఎక్కడుందో గుర్తిస్తారు.

వడదెబ్బతో యువకుడి మృతి


శివరాముడు (ఫైల్)

మిడుతూరు: పీపనగండ్ల గ్రామంలో ఓ యువకుడు వడదెబ్బకు గురై మృత్యువాత పడ్డాడు. గ్రామానికి చెందిన చాకలి రామకృష్ణ, సావిత్రి దంపతుల మూడో కుమారుడు శివరాముడు (22) తర్తూరు జాతరలో నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలకు వరుసగా మూడు రోజులు వెళ్లి శుక్రవారం వడదెబ్బకు గురై అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

తాగిన మత్తులో కిందపడి వ్యక్తి మృతి

వెల్దుర్తి: మద్యం తాగిన మత్తులో కిందపడి కలుగొట్ల గ్రామానికి చెందిన ఎల్లరాజు(29) మృతిచెందాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎల్లరాజు గ్రామంలో వ్యవసాయం చేసేవాడు. డెకరేషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మూడేళ్ల క్రితం భార్యతో విడాకులు తీసుకుని అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 5వ తేదీ బుధవారం మద్యం సేవించి గ్రామ సమీపంలోని రెడ్డిగారి చింతమాను రాళ్ల గుట్ట దగ్గర కింద పడి గాయపడ్డాడు. గమనించిన తమ్ముడు, తల్లి.. కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ కోలుకోలేక శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి తమ్ముడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.